# ఎన్నికలకు సర్వం సిద్ధం



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో భుజంగరావు


యాద్గార్‌పూర్‌లోని పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

- పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు
- పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లిన ఎన్నికల సిబ్బంది
- భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు


ఈవీఎంను సరిచూసుకుంటున్న సిబ్బంది


ఈవీఎంను తీసుకెళ్తున్న సిబ్బంది

బాన్సువాడ, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బాన్సువాడ ఆర్డీవో భుజంగరావు అన్నారు. బాన్సువాడలోని ఎస్‌ఆర్‌ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల పంపిణీ కార్యక్రమంలో భాగంగా రిటర్నింగ్ అధికారి బుధవారం విలేకరులతో మాట్లాడారు. బాన్సువాడ నియోజకవర్గ కేంద్రంలో 258 పోలింగ్ కేంద్రాలు, 258 ప్రిసైడింగ్ అధికారులు, 258 అసిస్టెంట్ ప్రిసైడింట్ అధికారులు, 516 వోపీవోలతో కలిపి మొత్తం 1,032 మంది సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. రిజర్వులో మరో 208 మంది సిద్ధంగా ఉన్నారని చెప్పారు. 28 మైక్రో అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు. 21 రూట్లను ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో 12 మోడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాటిలో ఐదు మహిళా మోడల్ పోలింగ్ కేంద్రాలు, ఒకటి పీడబ్ల్యూడీ కేంద్రం, ఒకటి యూత్ మోడల్ పోలింగ్ కేంద్రంతోపాటు ఐదు జనరల్ మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 28 రూట్లలో 75 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో ఇప్పటికే పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు వరప్రసాద్, రాజు, ఎస్‌ఆర్‌ఎన్‌కే ప్రిన్సిపాల్ గంగాధర్, డీఏవో నారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

**పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన ఎన్నికల సిబ్బంది**

బాన్సువాడ రూరల్, నవంబర్ 29 : బాన్సువాడ అసెంబ్లీ నియోజకర్గంలోని 258 పోలింగ్ కేంద్రాల్లో జరిగే ఎన్నికలకు అధికారులు పూర్తి ఏర్పాటు చేశారు. బుధవారం బాన్సువాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి భుజంగ్‌రావు ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, ఎన్నికలకు కావాల్సిన వస్తువులను పోలింగ్ అధికారులకు అందజేశారు. బూత్‌ల వారీగా సిబ్బందికి ఎన్నికల సామగ్రి ఆయన అందజేశారు. బాన్సువాడ నియోజవకర్గంలో 258 పోలింగ్ కేంద్రాలు ఉండగా దాదాపు 2,000 మంది పోలింగ్ సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి పోలింగ్ సిబ్బంది పోలీస్ పహారాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఈ ఎన్నికల్లో 1,95,191 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 75 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు.

**ఉమ్మడి కోటగిరి మండలంలో పోలింగ్ ఏర్పాట్లు పూర్తి**

కోటగిరి/రుద్రూర్, నవంబర్ 29 : ఉమ్మడి కోటగిరి, రుద్రూర్ మండలాల్లో గురువారం జరగనున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల పోలింగ్ అధికారులు, సిబ్బంది బుధవారం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఇందుకోసం స్థానిక అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్నిరకాల వసతులు, సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. వివిధ గ్రామాలకు పోలింగ్ అధికారులు, సిబ్బంది బ్యాలెట్ బాక్సులు పోలింగ్ సామాగ్రితో చేరుకొన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు తెలిపారు.

## ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగం

కోటగిరి, నవంబర్ 29 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి కోటగిరి మండలంలో 80 ఏండ్లు దాటిన వృద్ధులు ఇంటి వద్ద నుంచే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కోటగిరి, పొతంగల్ మండలాల తహసీల్దార్లు ప్రభాకర్, రమేశ్ బుధవారం తెలిపారు. కోటగిరి మండలంలో 91 మందిలో వృద్ధులు 43 మంది, దివ్యాంగులు 48 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ప్రభాకర్ తెలిపారు. పొతంగల్ మండలంలో 76 మందిలో వృద్ధులు 52 మంది, దివ్యాంగులు 24 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తహసీల్దార్ రమేశ్ తెలిపారు.

## రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ నాయకులపై కేసు

- బీజేపీ నాయకులు చేస్తున్న ఆరోపణలో నిజం లేదు
- సమగ్ర విచారణ జరపాలని బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

బాన్సువాడ, నవంబర్ 29 : బీజేపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ నాయకులపై కేసు పెట్టారని, లేని పోని అంశాలను జోడించి ఓట్లు రాబట్టుకోవాలన్న దురుద్దేశంతోనే ఫిర్యాదు చేశారని రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ డాక్టర్ అంజిరెడ్డి విమర్శించారు. బాన్సువాడలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బాన్సువాడలోని లింగాల రవీందర్‌రెడ్డి ఇంటి పక్కన కొందరు వ్యక్తులు ఉండడం, బీఆర్ఎస్ నాయకులు అటువైపు వెళ్లగా వారు ఇతర ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇతర ప్రాంతం వారు డబ్బులతో ఉండడం, బీఆర్ఎస్ నాయకులను గమనించి పారిపోయేందుకు యత్నించినట్లు చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు వారి వెంట వెళ్లగా దాడి చేసే ప్రయత్నం చేశారని వివరించారు. వారి అక్రమాలను కప్పిపెట్టుకునేందుకే పోచారం భాస్కర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టాడని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బాన్సువాడ సొసైటీ అధ్యక్షుడు ఏర్వాల కృష్ణారెడ్డి, హన్‌మాన్ వ్యాయామశాల అధ్యక్షుడు గురు వినయ్‌కుమార్, మహ్మద్ ఎజాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి

## బీఆర్ఎస్‌లో చేరిక



చందూర్‌లో బీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

చందూర్, నవంబర్ 29 : చందూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ పార్టీలో బుధవారం 20 మంది చేరారు. వీరికి బీఆర్ఎస్ నాయకులు గులాబీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ప్యారం అశోక్, పోచారం స్నేహితుడు దుర్కి పోశెట్టి, సాయారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాపై పోలీసుల నిఘా

- రెచ్చగొట్టే పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు
- పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ హెచ్చరిక

నిజామాబాద్ క్రైం, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని సెల్‌ఫోన్ నెట్‌వర్క్ సంస్థలకు సంబంధించి వాట్సాప్ గ్రూప్‌లతోపాటు ఇతర సోషల్ మీడియాల్లో వివాదాస్పద పోస్టులు పెడితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యాక్టివ్‌గా ఉంటూ వివిధ వాట్సాప్ గ్రూపుల్లో చేసే పోస్టులపై 24x7 ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. నేటి పోలింగ్ సందర్భంగా వాట్సాప్‌లలో ఎలాంటి పోస్టింగ్‌లు పెడుతున్నారనే వాటిపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలిపారు. వాట్సాప్, టెలిగ్రాంతోపాటు ఇతర సోషల్ మీడియాల్లో మతపరమైన, రెచ్చగొట్టే, వివాదాస్పద పోస్టులు పెట్టవద్దని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై శిక్షాస్మృతి (ఐపీసీ), ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇలాంటి నేరాలకు సుమారు 10 సంవత్సరాల వరకు కఠిన శిక్షపడే అవకాశం ఉందని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఎవరు కూడా రెచ్చగొట్టే, మత పరమైన పోస్టులు పెట్టవద్దని సూచించారు. వివాదాస్పద పోస్టులు పోస్ట్ చేస్తే డయల్ 100కు లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు.



## ఉమ్మడి కోటగిరి మండలంలో భారీ వర్షం

కోటగిరి, నవంబర్ 29 : ఉమ్మడి కోటగిరి మండలంలోని పొతంగల్, సోంపూర్, టాక్లీ, యాద్గార్‌పూర్, వల్లభపూర్, దోమలెడ్గితోపాటు ఆయా గ్రామాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. సాయంత్రం మొదలైన ఈదురు గాలులు అనంతరం 9 గంటల నుంచి భారీ వర్షం కురిసింది. పలు చోట్ల వడగండ్ల వాన కురిసింది. కోటగిరి మండలంలో 47 మిల్లీ మీటర్ల, పొతంగల్ మండలంలో 61.5 మి.మీ వర్షపాతం నమోదైంది.